క్లుప్తంగా

విద్యాసామగ్రి అందజేత



విద్యాసామగ్రి అందజేస్తున్న సీఐ మురళీకృష్ణ

మదనపల్లె సిటీ : స్థానిక బర్మావీధిలోని చైతన్య అనాథ ఆశ్రమ పాఠశాలలో బుధవారం గుడ్ విల్ కంప్యూటర్స్ అధినేత అజయ్‌కుమార్ విద్యార్థులకు రూ.20 వేలు విలువ చేసే విద్యా సామగ్రిని అందజేశారు. కార్యక్రమానికి టు టౌన్ సీఐ మురళీకృష్ణ హాజరై విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్.ఐ చంద్రమోహన్, సైకాలజిస్టు సుధాకర్‌రెడ్డి, రేవతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



రేణుక మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : మండలంలోని యర్రగుంట్లపల్లె పంచాయతీ కురవపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సహదేవ కుమార్తె సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రేణుక (25) అకస్మికంగా మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి బుధవారం కురవపల్లెకు చేరుకుని రేణుక మృతదేహానికి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు.

వాల్మీకిపురం : మండలంలోని విఠలంకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ నాగరాజు భార్య క్రిష్ణవేణి (34) బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తన అనుచరులతో కలసి క్రిష్ణవేణి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బోడి గుట్టకు నిప్పు



మంటలను అదుపు చేస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం : పీటీఎం సమీపంలోని బోడి గుట్టలో బుధవారం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఎవరో ఆకతాయిలు నిప్పు పెట్టడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో గుట్ట దిగువ భాగంలో ఉన్న మామిడి తోటకు మంటలు చుట్టుకోవడంతో రైతులు, ప్రజలు అప్రమత్తమై మంటలను అదుపు చేశారు. మంటలు తోటలోకి ప్రవేశించకుండా దారి మళ్లించడంతో ప్రమాదం తప్పింది.

సంక్రమణ వ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణ

బి.కొత్తకోట : సంక్రమణ వ్యాధులపై ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై జిల్లా విద్య, ఆరోగ్య అధికారి సత్యనారాయణ వివరించారు. బుధవారం మండలంలోని గోళ్లపల్లె జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనుగుణంగా వ్యాధుల వ్యాప్తి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. టీబీ, కలరా, చికెన్ గున్యా, వైరల్ ఫీవర్ గురించి వివరించారు. బాలికలకు సంబంధించిన వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య సమస్యలపై ఆరోగ్యఅధికారి విజయకుమారి తెలియజేశారు. హెచ్‌ఎం కాంతారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రజక సంఘం గ్రామ కమిటీ ఎన్నిక



ప్రమాణస్వీకారం చేస్తున్న రజక సంఘం నూతన కమిటీ

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె గ్రామ రజక సంఘం నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. బుధవారం చెర్లోపల్లెలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర రజక సంఘం ఉపాధ్యక్షుడు నాగయ్య ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకొన్నారు. గ్రామకమిటీ అధ్యక్షుడిగా శ్రీరాములు, ఉపాధ్యక్షుడిగా వెంకటరమణ, కార్యదర్శిగా శ్రీనివాసులు, ఉపకార్యదర్శిగా రెడ్డిప్రసాద్, కోశాధికారిగా గణేష్, సభ్యులుగా గంగాధర్, మోహన్, వెంకటరమణ,రెడ్డెమ్మలు ఎన్నుకొన్నారు. కార్యక్రమంలో జిల్లా రజక సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు రమేష్, పెద్దీడు నాగరాజ, మదనపల్లె కమిటీ అధ్యక్షుడు రెడ్డెప్ప పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

ఆర్డీఓ ఎం.ఎస్.మురళి



ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : ఎమ్మెల్సీ ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులు ఎన్నికలు సజావుగా జరిపేందుకు అవసరమైన శిక్షణను సమగ్రంగా పొందాలని మదనపల్లె ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. ఈ నెల 13న జరిగే గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు బుధవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రిసైడింగ్ ఆఫీసర్ల బాధ్యత అత్యంత కీలకమైనదన్నారు. విధుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ.. ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలన్నారు. ఎన్నికల నిర్వహణపై సిబ్బందికి విలువైన సూచనలు అందించారు. ఎన్నికలలో బ్యాలెట్ బాక్సుల నిర్వహణపై అధికారులకు పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలన్నారు. ఎన్నికల విధులు సమర్థంగా నిర్వహించేందుకు అధికారులు సంసిద్ధంగా ఉండాలన్నారు. పీఓల విధులు, పోలింగ్ సామగ్రి, ఎన్నికల ముందు నిర్వహించాల్సిన ప్రక్రియ, బ్యాలెట్ బాక్సులు సీజ్ చేసే విధానంపై అధికారులు అవగాహన పొందాలన్నారు. బ్యాలెట్ పత్రాల వినియోగం, డిక్లరేషన్ ప్రక్రియ చాలా ముఖ్యమన్నారు. టెండర్ బ్యాలెట్ వంటి అంశాలపై అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రంలోకి ఎవరిని అనుమతించాలి, ఎవరిని అనుమతించకూడదు, పోలింగ్ సమయంలో నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలపై విశదీకరించారు. అనంతరం బ్యాలెట్ బాక్సుల వినియోగంపై డెమో రూపంలో అవగాహన కల్పించారు. పోలింగ్ ప్రక్రియలో కీలకపాత్ర వహించే ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులుగా డివిజన్‌లోని సీనియర్ అధికారులను నియమించామన్నారు. వీరికి రెండువిడతలుగా శిక్షణ ఇస్తామన్నారు. మొదటివిడతలో బ్యాలెట్‌బాక్సుల నిర్వహణ గురించి ప్రయోగాత్మకంగా వివరిస్తారని, రెండోవిడతలో ఓటుహక్కు వినియోగించే విధానంపై తర్ఫీదు ఇస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటువేసే విధానంపై స్వీప్ కార్యక్రమం ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు. ఓటర్లు ఎన్నికల సంఘం నిర్దేశించిన పెన్ మాత్రమే వినియోగించాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీవైఎస్వో గోపాలకృష్ణ, తహసీల్దార్లు సీకే.శ్రీనివాసులు, ధనంజయ, డీఏఓ శేషయ్య, పీఓ, ఏపీఓలు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

కలికిరి: ఈ నెల 13న జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కలికిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ బూత్‌లను మదనపల్లి ఆర్డీఓ మురళి బుధవారం పరిశీలించారు. పట్టభద్రుల ఓటర్లకు రెండు, ఉపాధ్యాయ ఓటర్లకు ఒక పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు భాగ్యలత ఆయన వివరించారు. దివ్యాంగులకు ర్యాంప్ సదుపాయం, గదులలో అవసరమైన వసతులపై ఆర్డీఓ విచారించారు. ఎంపీడీఓ గంగయ్య, ఎస్ఐ లోకేష్ రెడ్డి, వీఆర్‌ఓ విశ్వనాథ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం



విద్యార్థినికి ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వవిద్యార్థి సింధు, తల్లి మంజుల

మదనపల్లె : చదువుకునే సమయంలో తాను ఎదుర్కొన్న ఇబ్బందులు ఇతరులు ఎదుర్కోవద్దని ఓ పూర్వ విద్యార్థిని నలుగురు పేద విద్యార్థుల చదువుకు ఆర్థికసహాయం అందించి పెద్దమనసు చాటుకుందని జ్ఞానాంబిక కళాశాల కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ తెలిపారు. బుధవారం కళాశాల పూర్వ విద్యార్థిని ఎస్.సింధు చేతుల మీదుగా పేద విద్యార్థులు హిమబిందు, యశ్వంత్, గౌతమి, నిరంజన్ రెడ్డికి రూ.30,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గురుప్రసాద్ మాట్లాడుతూ.. ఎస్.సింధు తమ కళాశాలలో బి.కాం (కంప్యూటర్ అప్లికేషన్స్) చదువుకుని విప్రో టెక్నాలజీలో రిసోర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తోందన్నారు. కొంతమంది పేద విద్యార్థులకైనా అండగా నిలుద్దామనే సదుద్దేశంతో ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకురావడం అభినందనీయమన్నారు. ఉన్నతస్థానాల్లో ఉన్న పూర్వవిద్యార్థులు సింధును ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, సింధు తల్లి మంజుల పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

రామసముద్రం : రామసముద్రం మండలం చెంబకూరులో వెలసిన శ్రీగట్టు వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం అంకురార్పణతో ప్రా రంభంకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఏటా శ్రీగట్టు వెంకటరమణ స్వామి ఉత్సవాలు వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఉత్సవాలకు ఆంధ్ర, కర్నాటక, తమిళనాడు మూడు రాష్ట్రా ల భక్తులు హాజరౌతారని నిర్వాహకులు తెలిపారు.

అమరవీరులకు నివాళి

బి.కొత్తకోట : ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో 2009 మార్చి ఒకటిన హైదరాబాద్‌లో జరిగిన ఘటనలో అమరులైన ఎమ్మార్పీఎస్ కార్యకర్తలకు బుధవారం స్థానిక జ్యోతిచౌక్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. వర్గీకరణ కోసం జరుగుతున్న ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఆగదని జిల్లా ప్రధానకార్యదర్శి భవానీ వెంకటేష్, ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దుమ్ముచిన్నా అన్నారు. వర్గీకరణ కోసం ప్రాణత్యాగాలకు సిద్ధమన్నారు. కార్యక్రమంలో చౌడప్ప, శ్రీనివాసులు, గంగన్న, నరసింహులు, రామప్ప, ఉత్తన్న, రఘు, ముని, శివయ్య పాల్గొన్నారు.

బ్రాహ్మణ మహిళా సదస్సును జయప్రదం చేయాలి

మదనపల్లె సిటీ : బ్రాహ్మణ మహిళా సదస్సును జయప్రదం చేయాలని బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు కోదండ రామయ్య, కార్యదర్శి నాగభూషణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమండ్రిలో 5న జరిగే సదస్సుకు బ్రాహ్మణ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. రానున్న రోజులల్లో బ్రాహ్మణ మహిళలు రాజకీయంగా కూడా చైతన్యవంతులై రాజకీయాల్లో ప్రత్యక్షంగా పాల్గొనే విధంగా వీరిని చైతన్యపరచడమే లక్ష్యంగా సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

వాల్మీకిపురం : సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలను చైతన్య పరచాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని తాటిగుంటపల్లికి చెందిన ఆవుల ఆనంద్ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని బుధవారం ఆవుల ఆనంద్ ఆ గ్రామ సర్పంచ్ నాగేశ్వర నాయుడుతో కలసి వెళ్లి పూలమాల వేసి, శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కేశవ రెడ్డి, బివి రమణ, చంద్రశేఖర్, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

బి.కొత్తకోట : జగనన్న కాలనీల్లో పేదల ఇళ్ల నిర్మాణాల పూర్తికి లక్ష్యాలు సాధించకుంటే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ శంకరయ్య అన్నారు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఉగాదికి ఇళ్ల నిర్మాణాల ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలన్నారు. మిషన్ అంత్యోదయ సర్వే వేగవంతం చేసి పూర్తి చేయాలని కోరారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

126 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

వాల్మీకిపురం : షిరిడిసాయి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య పరీక్షలకు విశేష స్పందన లభించింది. తిరుపతి అరవింద్ కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన శిబిరంలో 126 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. వీరిలో 36 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు డాక్టర్లు కీర్తి, నవాకాంత్ తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చింతల ఆనంద రెడ్డి, నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, శంకర, సత్య, మానవతా సంస్థ జిల్లా అధ్యక్షులు క్రిష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీకి రూ.12.12 లక్షల ఆదాయం



నిమ్మనపల్లె పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

నిమ్మనపల్లె : వేలం ద్వారా నిమ్మనపల్లె గ్రామ పంచాయతీకి రూ.12.12 లక్షల ఆదాయం సమకూరినట్లు ఎంపీడీఓ లీలామాధవి తెలిపారు. బుధవారం స్థానిక సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి గిరిధర్‌నాయక్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. 18 మంది వేలంలో పాల్గొనగా, వారపుసంతను రూ.6.35లక్షలకు చింతపర్తి గ్రామం రాములవారిపల్లెకు చెందిన ఆర్.సోమశేఖర్ దక్కించుకున్నారు. బస్టాండ్‌గేటును ఈతకట్ల చంద్రశేఖర్ రూ.1.21 లక్షలకు దక్కించుకున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు తొమ్మిది పంచాయతీ షాపు రూములకు వేలం నిర్వహించగా ఏడాదికాలానికి రూ.4,56,000 లక్షల ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో సర్పంచ్ పాపులమ్మ, మల్లప్ప, సచివాలయ కార్యదర్శి రాజేష్, వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ సాధుసురేష్

నిమ్మనపల్లె : పశువుల్లో వ్యాప్తిచెందే గాలికుంటు వ్యాధిని నివారించేందుకు టీకాలు వేయించాలని పశువైద్యాధికారి డాక్టర్.సాధుసురేష్ తెలిపారు. బుధవారం నిమ్మనపల్లె పంచాయతీ పరిధిలో గాలికుంటువ్యాధి (అమ్మతల్లి) నివారణకై పశువులకు టీకాలు వేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గాలికుంటు వ్యాధి సోకిన పశువు మేతమేయకుండా అనారోగ్యం బారిన పడుతుందన్నారు. దీనివల్ల ఆవులో పాలదిగుబడి సామర్థ్యం తగ్గుతుందని, సకాలంలో ఎదకు రాకుండా చూలు నిలవదన్నారు. ఎండతాకిడికి పశువులు తీవ్రంగా ఆయాసపడుతాయన్నారు. మండలంలో 14,500 పాడిఆవులు ఉన్నాయన్నారు. వ్యాధి నివారణకు తప్పనిసరిగా టీకాలు వేయించుకొని, విలువైన పశువులను వ్యాధి బారి నుంచి కాపాడుకోవాలని సూచించారు. 30 రోజుల పాటు టీకాలు వేస్తామన్నారు. పాడిరైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

టీకాలు సద్వినియోగం చేసుకోవాలి

కలకడ : గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం అందించే ఉచిత టీకాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యశాల అసిస్టెంట్ మోహన్‌బాబు కోరారు. 30వ తేదీ వరకు జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా బుధవారం మండలంలోని కె.దొడ్డిపల్లె పంచాయతీ, గోపాలపురంలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. గాలికుంటువ్యాధి లక్షణాలు, కలిగే నష్టాలను పశువుల యజమానులకు తెలియజేశారు.

నాటుసారా స్వాధీనం

నిందితుడు అరెస్టు, వాహనం సీజ్



నాటుసారాతో పాటు నిందితుడు, వాహనాన్ని చూపుతున్న ఎస్‌ఈబీ అధికారులు

ములకలచెరువు : అక్రమంగా తరలిస్తున్న నాటుసారా స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ మల్లిక బుధవారం తెలిపారు. సీఐ కథనం మేరకు... సర్కిల్ పరిధిలోని పెద్దమండ్యం మండలం గుడిసాని చెరువు క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక బొలేరో వాహనం నిలపకుండా వేగంగా వెళ్లిపోయిందన్నారు. సిబ్బంది వాహనంతో వెంబడించి పట్టుకొని బొలేరో వాహనాన్ని తనిఖీ చేయడంతో అందులో 50 లీటర్ల నాటుసారా ఉన్నట్లు గుర్తించారు. పెద్దమండ్యం మండలం రామానాయక్ తండాకు చెందిన డ్రైవర్ క్రిష్ణానాయక్‌ను అరెస్టు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు సీఐ వెల్లడించారు. దాడుల్లో ఎస్ఐ వై.బాబు, సిబ్బంది లింగమూర్తి, రమణ, మణికుమార్, హరిప్రసాద్ ఉన్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో స్వామి వారి ప్రతిమలు

పెద్దతిప్పసముద్రం: స్థానిక శ్రీ పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రాత్రి శివ పార్వతుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయం నిర్వాహకులు ననగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో వేద పండితులు శివ పార్వతుల ప్రతిమలకు సుందరమైన పుష్పాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ముత్యపుపందిరిపై శ్రీ లక్ష్మీనరసింహుడు



ముత్యపుపందిరి వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామిని ముత్యపు పందిరి వాహనంపై ఘనంగా ఊరేగించారు. స్వామివారి బ్రహోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన బుధవారం ఉదయాన్నే స్వామివార్లకు తిరుచ్చి, శుద్ధి తోమాలసేవ, ఏకాంతసేవలు నిర్వహించారు. స్నపన తిరుమంజనం కావించి ఊంజల్ సేవ నిర్వహించారు. వాహన మండపంలో స్వామివారి వాహనాన్ని రంగురంగుల పుష్పాలతో అలంకరించారు. ముత్యపు పందిరి వాహనంపై కొలువుదీరి గ్రామపుర వీధుల గుండా మేళతాళాలతో ఘనంగా ఊరేగాడు. అనంతరం స్వామివార్లను హనుమంత వాహనంపై కొలువు దీర్చారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు స్వాములు పాల్గోన్నారు.

కొత్త వ్యక్తుల సంచారంపై సమాచారం ఇవ్వండి

- గంజాయి విక్రయదారులపై ఉక్కుపాదం మోపుతాం
- 28 ద్విచక్రవాహనాలు స్వాధీనం
- రాయచోటి డీఎస్పీ శ్రీధర్



కార్డెన్ సెర్చ్ ద్వారా 28 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొన్న పోలీసులు

గుర్రంకొండ : కొత్తవ్యక్తుల సంచారంపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని రాయచోటి డీఎస్పీ శ్రీధర్ కోరారు. బుధవారం మండలకేంద్రమైన గుర్రంకొండలోని ఇందిరమ్మ కాలనీలో భారీ ఎత్తున పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా కాలనీలోని అన్ని ఇళ్లలో సోదాలు చేశారు. సోదాల్లో రికార్డులు సరిగ్గాలేని 28 ద్విచక్ర వాహనాలను స్వాదీనం చేసుకొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీలో బయట ప్రాంతాల నుంచి వచ్చిన కొత్త వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వద్దన్నారు. ఆధార్ కార్డులో పూర్తి సమాచారం ఉండి తెలిసిన వ్యక్తులకే ఇళ్లు అద్దెకు ఇవ్వాలన్నారు. రికార్డులు సరిగ్గాలేని వాహనాలను రోడ్డుపై నడపకూడదన్నారు. ఎదైనా ప్రమాదాలు జరిగితే ప్రమాద బీమా వర్తించదన్నారు. కాలనీ వాసులు పలు సమస్యలను డీఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. కాలనీలో రాత్రిళ్లు 11గంటల తర్వాత కూడా పలువురు గుంపులు, గుంపులుగా సంచరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. కాలనీలో కొంత మంది గంజాయి విక్రయిస్తున్నారని, యువత వాటికి బానిసలుగా మారుతున్నారన్నారు. పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థినులను పలువురు పోకిరీలు వేధింపులకు గురిచేస్తున్నారని ఫిర్యాదు చేశారు. గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని, కాలనీ సమస్యలపై దృష్టి సారించి పరిష్కరిస్తామని డీఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కలకడ సీఐ నాగేంద్ర, గుర్రంకొండ, కలికిరి, కేవీపల్లె,కలకడ ఎస్ఐలు దిలీప్‌కుమార్, లోకేష్‌రెడ్డి, లోకేష్, తిప్పేస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

టీబీ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు



గురుకుల పాఠశాలలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : టీబీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా మందులు అందిస్తున్నట్లు పీలేరు టీబీ యూనిట్ క్షయ నివారణాధికారి డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. బుధవారం స్థానిక చిత్తూరు రోడ్డు మార్గంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ర్యాలీ, అవగాహ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధి మైక్రో బ్యాక్టీరియమ్ ట్యూబర్ క్లోసిస్ అనే బ్యాక్టీరియాతో గాలి ద్వారా వ్యాప్తి చెందుతుందని తెలిపారు. ఒకట్రెండు వారాలు మించి దగ్గు, జ్వరం , ఆకిలి లేకపోవడం, బరువు తగ్గడం, చాతిలో నొప్పి, గళ్లలో రక్తం పడడం టీబీ లక్షణాని తెలిపారు. లక్షణాలు ఉన్నవారు ప్రభుత్వాస్పత్రిలో సంప్రదిస్తే ఉచితంగా గళ్ల పరీక్షలు చేస్తామని చెప్పారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందుల తోపాటు పోషకాహారం కోసం నెలకు రూ. 500 వారి ఖాతాకు జమ చేయడం జరుగుతోందన్నారు. టీబీ ముక్త్ భారత్‌లో భాగంగా నిక్షయ మిత్రల ద్వారా టీబీ రోగులకు పోషకాహారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత, హెచ్‌ఈ ఉషారాణి, సూపర్‌వైజర్స్ మోహన్, పవన్‌కుమార్, పుష్పలత, సీహెచ్‌వో చంద్రలేఖ, ఆశ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరల పెంపు ఉపసంహరించుకోవాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు

మదనపల్లె : గృహ వినియోగానికి ఉపయోగించే ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధర రూ.50, వాణిజ్య సిలిండర్ ధర రూ.350 పెంచుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ..నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటి సామాన్యప్రజలు దుర్భరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో గ్యాస్ ధరలు రెండు నెలల వ్యవధిలో రెండుసార్లు పెంచడం దారుణమన్నారు. మూడేళ్ల క్రితం వరకు రూ.417 ఉన్నటువంటి డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధర నేడు రూ.1,155కు పెరిగిందని, గ్యాస్‌పైన ఇచ్చే సబ్సిడీ జమలు రెండేళ్లుగా కేంద్రప్రభుత్వం నిలిపేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే గృహవినియోగానికి సబ్సిడీ కింద ఇచ్చే సిలిండర్ల సంఖ్య కుదించారన్నారు. వాణిజ్యసిలిండర్‌ను ఏకంగా రూ.350 పెంచడంతో స్వయం ఉపాధి పొందుతున్న చిరువ్యాపారులపై తీవ్రప్రభావం పడుతుందన్నారు. పెంచిన ధరలు తగ్గించేంతవరకు జిల్లా వ్యాప్తంగా నిరసనలు తెలపాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

కలెక్టర్‌ను కలసిన జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి

రాయచోటి : అన్నమయ్య జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా నియమితులైన విజయశేఖర్ కలెక్టర్ గిరీషా పీఎస్‌ను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. బుధవారం కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో కలిశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన తరువాత జిల్లాలో అక్రమ ఇసుక రవాణా, లిక్కర్, గ్యాంబ్లింగ్ వంటి అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపుతామని చెప్పారు. జిల్లాలో ఎక్కడైనా అక్రమాలకు పాల్పడితే వారు ఎంతటివారైనా సరే సహించేది లేదని హెచ్చరించారు.

పండుటాకుల ఆనందం



పీలేరులో వృద్ధురాలికి పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కురబలకోట : మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం తెల్లవారు జామునే తలుపు తట్టి పింఛన్లు పంపిణీ చే శారు. ఈసారి గ్రామ వలంటీర్లతో పాటు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు కూడా పాల్గొన్నారు. తలుపు తట్టి ఫించన్లు ఇవ్వడంతో పింఛన్ దారులు ఆనందం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో పని పాటలు మానుకుని పింఛన్ల కోసం పడిగాపులు కాయాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు జగన్ పుణ్యమా..అని తెల్లవారకముందే చేతికి పింఛన్లు అందుతున్నాయన్నారు. పని పాటలకు కూడా వెళుతున్నామని సంతోషం వ్యక్తం చేశారు. డోర్ డెలివరీలా ఇంటికే పింఛన్ వస్తుండడంతో సీఎం జగన్ ప్రభుత్వాన్ని లబ్ధిదారులు తలచుకుంటున్నారు.

పీలేరులో..

పీలేరు : వైఎస్సార్ పింఛన్ కానుకలో భాగంగా బుధవారం మండలంలో 90 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ మురళీమోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలో మొత్తం 9581 మంది లబ్ధిదారులకు ఉండగా 90 శాతం మందికి రూ. 2.12 కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఒకట్రెండు రోజుల్లో వందశాతం పూర్తి చేస్తామని చెప్పారు.

85 శాతం పెన్షన్ల పంపిణీ



కురబలకోట: తూగువారిపల్లెలో పింఛన్లు అందుకున్న వృద్ధులు

తంబళ్లపల్లె : మండలంలో బుధవారం 8 5శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ ఆనంద్‌కుమార్ తెలిపారు. మండలంలో అన్ని రకాల పెన్షన్లు 6084 మంది లబ్ధిదారులు ఉండగా 5178 మందికి పంపిణీ చేసినట్లు తెలిపారు. గుండ్లపల్లె క్లస్టర్ గ్రామ వలంటీర్ సోమునాయక్ మొరుసుపల్లె బురుజులో వృద్ధురాలు మంగమ్మ నడవలేని స్థితిలో అనారోగ్యంతో ఉండగా అక్కడికి వెళ్లి పెన్షన్ అందజేయడంతో ఆమె సంతోషానికి అవధులు లేకుండా పోయాయి.